ప్రజాశక్తి
శుక్రవారం 30 మే 2025 5 అనంతపురం

వ్యవసాయ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్

రోజువారీ పని ఒత్తిడి నేపథ్యంలో జనం కాస్త ఉపశమనం పొందే వాటిలో సినిమాలు ఒకటి. రెండున్నర గంటల పాటు తమ ఒత్తిడిని దూరం చేసుకుని ప్రశాంతంగా ఉండేందుకు సినిమాను ప్రేక్షకలు ఎంచుకుంటారు. కుటుంబంతో సరదాగా గడిపేందుకు సినిమా ఉపయోగపడుతోంది. అలాంటి సినిమా ఇప్పుడు వ్యాపారం అయ్యింది. మల్టీప్లెక్స్ సినిమాల రాకతో థియేటర్ల స్వరూపమే మారిపోయింది. అధిక ధరలతో ప్రేక్షకుడిని నిట్టనిలువునా దోపిడీ చేస్తున్నారు. టికెట్ ధర నుంచి తినుబండారు వరకు అన్నింటి ధరనూ రెండు, మూడింతలు పెంచి ప్రేక్షకుడికి 'సినిమా' చూపిస్తూ మల్టి'ఫుల్'గా దోపిడీ చేస్తున్నారు.

మల్టి'ఫుల్' దోపిడీ..!

- ◆ సినిమా థియేటర్లలో ధరాభారాలు
- ◆ టికెట్‌తో పాటు తినుబండారాలన్నీ అధికమే
- ◆ పండుగపూట మరింత దోపిడీ
- ◆ కుటుంబంతో సినిమాకు వెళ్తే రూ.2వేలు ఖర్చు చేయాల్సిందే..
- ◆ సగటు ప్రేక్షకుడి జేబుకు చిల్లులు
- ◆ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న తనిఖీలు

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా దాదాపు అన్ని పట్టణ ప్రాంతాల్లో మల్టీప్లెక్స్ థియేటర్లు ఉన్నాయి. అనంతపురం, రాయదుర్గం, తాడిపత్రి, గుంతకల్లు, ధర్మవరం, హిందూపురం, కదిరి, పెనుకొండ ప్రాంతాల్లో మల్టీప్లెక్స్ థియేటర్లు ఉన్నాయి. గత దశాబ్దం క్రితం వరకు సాధారణ థియేటర్లుగా ఉన్న వాటిని కార్పొరేట్ వ్యక్తులు లీజుకు తీసుకుని వాటిని మల్టీ ఫ్లెక్స్‌లుగా మార్చేశారు. థియేటర్‌కు అందమైన రంగలు అద్ది కార్పొరేట్ హంగును తీసుకుని వచ్చారు. థియేటర్లు కార్పొరేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిన తర్వాత ఒక్కసారిగా దాని స్వరూపమే మారిపోయింది. ముఖ్యంగా అందులో ప్రదర్శించే సినిమా టికెట్ల ధర, అక్కడ అమ్మే తినుబండారాల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. నలుగురు కుటుంబ సభ్యులున్న వారు సినిమాకు వెళ్లాలంటే రూ.1500 నుంచి రూ.2000 వరకు వరకు ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. పెద్ద హీరోలు నటించిన సినిమాలు విడుదలైన మొదటి వారం వరకు టికెట్ ధర రూ.600 వరకు నడుస్తోంది. సినిమా బాగుందని ప్రచారంలో వస్తే ఈ ధరను మరింత పెంచుతున్నారు. రెండు, మూడు రోజుల్లోనే సినిమా నిర్మాణానికి పెట్టిన పెట్టుబడులు మొత్తం రాబట్టుకునేలా ధరలను పెంచేస్తున్నారు. థియేటర్లలో తినుబండారాలు ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. బయట దొరికే వస్తువులనే మల్టీప్లెక్స్‌లో నాలుగింతల ధర పెంచి అమ్ముతున్నారు. బయట రూ.10కి దొరికే పాప్‌కాన్‌ను రూ.50 నుంచి రూ.100, రూ.10 కూల్‌డ్రింక్‌ను రూ.50, రూ.10 విలువజేసే సమోసా రూ.40, రూ.20 వాటర్‌బాటిల్ రూ.40 ఇలా అన్నంటి ధరలను పెంచి ప్రేక్షకుడి నడ్డివిరుస్తున్నారు. సినిమా హాల్లో ద్విచక్రవాహనం నిలపాలంటే రూ.20, కారు నిలపాలంటే రూ.50 వసూలు చేస్తున్నారు.

పండుగ వస్తే మరీ అధికం

పండుగ సీజన్‌లో సాధారణంగా కొత్త సినిమాలు ఎక్కువగా విడుదల అవుతుంటాయి. ఈ సమయంలో ప్రజలకు సెలవులు ఉండడంతో చాలా మంది సినిమాను చూసేందుకు ఇష్టపడతారు. దీనిని అదునుగా చేసుకుని మల్టీఫ్లెక్స్ నిర్వాహకులు ధరలను పెంచి సొమ్ము చేసుకుంటున్నారు. ఆ రోజుల్లో సినిమా టికెట్ ధరలను అమాంతం పెంచేస్తున్నారు.

సౌకర్యాలు నిల్

మల్టీఫ్లెక్స్ యాజమాన్యాలు ప్రేక్షకుల నుంచి ముక్కుపిండి ధరలు వసూలు చేస్తున్నా వసతులు కల్పించడంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. థియేటర్ల మరుగుదొడ్లలో కనీస శుభ్రత పాటించడం లేదు. నీటి వసతి అంతంతమాత్రంగానే ఉంటోంది. వారానికి ఒకసారి కూడా మరుగుదొడ్లను శుభ్రం చేస్తున్న దాఖలాలు లేవు. ఇక పార్కింగ్‌ంగ్ రుసుం రూ.20 నుంచి రూ.100 వరకు వసూలు చేస్తున్నా వాహనాలు నిలిపేందుకు నీడను ఏర్పాటు చేయడం లేదు. సినిమా థియేటర్లకు ఆనుకుని ఆరుబయట ఎండకే వాహనాలను నిలపాల్సిన పరిస్థితి ఉంది.

సినిమా థియేటర్లలో తనిఖీలు

సినిమా థియేటర్లలో జరుగుతున్న అధిక ధరలపై ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అధికారులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. బుధ, గురువారాల్లో రెవెన్యూ అధికారులు తనిఖీలు చేసి వాస్తవాలను గుర్తించారు. తహశీల్దార్లు, ఆర్డీవోలు స్వయంగా సినిమా థియేటర్లలోకి వెళ్లి పరిశీలన చేశారు. టికెట్, తినుబండారాల ధరలను అడిగి తెలుసుకున్నారు. సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లు, ఆహార వస్తువుల నాణ్యత గురించి తెలుసుకున్నారు. చాలా థియేటర్లలో సౌకర్యాలు లేవని, నాణ్యత ప్రమాణాలు పాటించలేదని గుర్తించారు. నిబంధనలు పాటించని థియేటర్ల నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తినుబండారాల ధరల వివరాలను ఖచ్చితంగా బోర్డుపై ప్రదర్శించాలని ఆదేశించారు. అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనల మేరకే సినిమా థియేటర్ల నిర్వహణ కొనసాగాలని ఆదేశించారు.

హిందూపురంలోని థియేటర్లలో తినుబండారాల ధరలు, మరుగుదొడ్లలో శుభ్రతను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

విత్తనాలు, ఎరువులను సిద్ధంగా ఉంచాలి

కార్యాలయాల్లో ఆకస్మిక తనిఖీలు చేస్తా
కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

ఖరీఫ్ - 2025 సీజన్ కోసం రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులను సిద్ధం చేయాలని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులను ఆదేశించారు. మండల పరిధిలోని దెయ్యాలకుంటపల్లి, వెంకటాపురం గ్రామాల్లో ఖరీఫ్ సన్నద్ధతపై జిల్లా, డివిజన్, మండల వ్యవసాయ అధికారులు, ఏపీ సీడ్స్, మార్క్ఫెడ్ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఖరీఫ్ కోసం అవసరమైన విత్తనాల కేటాయింపును మండలాల వారీగా చేపట్టాలన్నారు. ఆయా మండలాలకు సరిపడే విత్తనం అందుబాటులో ఉంచాలన్నారు. తక్కువ విత్తనం వస్తే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. జిల్లాకు 50,592 క్వింటాళ్ల వేరుశనగ కేటాయింపు జరిగిందన్నారు. క్షేత్రస్థాయిలో విత్తన పంపిణీ సక్రమంగా జరగాలన్నారు. ఇప్పటికే సిద్ధంగా ఉన్న ఎరువులను పంపిణీ చేయాలని సూచించారు. రైతు సేవ కేంద్రాల్లో పేమెంట్ 100 శాతం క్యూఆర్ కోడ్ ద్వారానే జరగాలన్నారు. త్వరలో తాను ఎవరికీ తెలియకుండా క్షేత్రస్థాయి పరిశీలన నిమిత్తం ఆకస్మిక తనిఖీలు చేస్తానన్నారు. ఆయా శాఖల అధికారులు జాగ్రత్తగా పని చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, ఏపీ సీడ్స్ డిఎం సుబ్బయ్య, మార్క్ఫెడ్ డిఎం పెన్నేశ్వరి, డివిజన్, మండల వ్యవసాయ అధికారులు, పాల్గొన్నారు.

నేటి నుంచి సబ్సిడీ వేరుశనగ రిజిస్ట్రేషన్

అనంతపురం : అనంతపురం జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ప్రభుత్వం అందించే సబ్సిడీ వేరుశనగ పంపిణీ కోసం రైతులు శుక్రవారం నుంచి రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ తెలిపారు. జిల్లాకు 50,592 క్వింటాళ్ల వేరుశనగ కేటాయింపు జరిగిందన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రాల్లో శుక్రవారం నుంచి దరఖాస్తులు చేసుకోవాలని చెప్పారు. కె-6 టిసిజిస్ 1694 రకం 30కిలోల బ్యాగ్ పూర్తి ధర రూ.2790 కాగా సబ్సిడీ పోను రూ.1674 రైతు వాటా చెల్లించాల్సి ఉంటుందన్నారు. కదిరి లేపాక్షి 1812 రకం 30కిలోలు పూర్తి ధర రూ.2460 కాగా సబ్సిడీ రూ.984పోను రైతులు రూ.1476 చెల్లించాల్సి ఉంటుందన్నారు. పట్టాదారు పాసుపుస్తకం ఉన్న రైతులు సబ్సిడీ వేరుశనగ కోసం రైతు సేవా కేంద్రం అధికారులను సంప్రదించాలన్నారు.

అహుడా ల్యాండ్ బ్యాంక్‌కు స్థల పరిశీలన

ప్రజాశక్తి-అనంతపురం

అహుడ ల్యాండ్ బ్యాంక్ కోసం స్థలాలను జాయింట్ కలెక్టర్, అహుడ వైస్ ఛైర్పర్సన్ శివ్ నారాయణ్ శర్మ గురువారం పరిశీలించారు. అనంతపురం నగరంలోని కొవ్వూరు నగర్ కోఆపరేటివ్ సొసైటీ స్థలం, కోర్టు రోడ్‌లోని ప్రభుత్వ ఐటిఐ స్థలం, గుత్తి రోడ్డులో తడకలేరు బ్రిడ్జిని ఆనుకుని ఉన్న 7 ఎకరాల స్థలాన్ని పరిశీలించారు. క్షేత్రస్థాయిలో స్థలాలను పరిశీలించి అందుకు అనుగుణంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

స్థల పరిశీలన చేస్తున్న జాయింట్ కలెక్టర్

కంటితుడుపుగా మద్దతు ధర పెంపు

ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

2025-26 సంవత్సరానికి ఖరీఫ్, రబీ పంటలకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ధాన్యం మద్దతు ధర తుడుపు చర్య మాత్రమేనని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు తరిమెల నాగరాజు గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలు ఉత్పత్తి ఖర్చులను తక్కువ చూపించి కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించడం వల్ల రైతులకు కనీస పెట్టుబడి ఖర్చులు కూడా రాని పరిస్థితి ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం వాస్తవ రైతుల ఖర్చులు లెక్కబెట్టి ఉత్పత్తి ఖర్చు అదనంగా 50 శాతం కలిపి మద్దతు ధరలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. వేరుశెనగ క్వింటాల్ రూ.10 వేలు ధాన్యం క్వింటాల్‌కు రూ.3వేలు కనీస మద్దతు ధర ప్రకటించి అమలు చేయాలని కోరారు. మిగిలిన అన్ని పంటలకు కూడా మద్దతు ధరలు పెంచి రైతులను ఆదుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సదస్సులో ప్రసంగిస్తున్న వి.రాంభూపాల్

సుందరయ్య స్ఫూర్తితో పోరాటాలు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.రాంభూపాల్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య పోరాట స్ఫూర్తితో సమస్యల పరిష్కారంపై పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.రాంభూపాల్ పిలుపునిచ్చారు. సుందరయ్య 40వ వర్ధంతి సందర్భంగా సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో గురువారం రాత్రి ప్రజాశక్తి కాలనీలో 'ప్రస్తుత రాజకీయాలు-సిపిఎం వైఖరి' అన్న అంశంపై సదస్సు నిర్వహించారు. సిపిఎం నాయకులు ముత్తుజా అధ్యక్షత నిర్వహించిన కార్యక్రమంలో ఆపార్టీ జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప, కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.నాగేంద్రకుమార్, నగర కార్యదర్శి రామిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ విశాలాంధ్రలో ప్రజారాజ్యం రావాలని, కులవివక్ష, అంటరానితనం పోవాలని, దున్నే వాడికే భూమి కావాలని, వ్యవసాయ కూలీలకు కూలి పెంచాలని, కార్మికులకు హక్కులు ఉండాలని నినాదాలతో పోరు సాగించారన్నారు. ఉద్యమాలకు ప్రజలను సమీకరించి పోరాటాలు నిర్వహించారన్నారు. పార్లమెంట్ సభ్యునిగా తన జీవిత కాలంలో ప్రజా ప్రతినిధిగా ఎలా ఉండాలో ఆచరణలో చూపిన వ్యక్తి అన్నారు. పార్లమెంట్‌కు సైకిల్‌లో వెళ్లిన గొప్ప రాజకీయ వేత్త సుందరయ్య అన్నారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపైన వేస్తున్న భారాలకు వ్యతిరేకంగా సుందరయ్య పోరాట స్ఫూర్తితో ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్లు రద్దు చేసేలా పోరు సాగించాలన్నారు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేసేలా పాలకులపై ఒత్తిడి పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వెంకటనారాయణ, వార్డు సభ్యురాలు ఆదెమ్మ, నగర కార్యదర్శివర్గ సభ్యులు, గోపాల్, ప్రకాష్, ఇర్ఫాన్, వలి, నగర కమిటీ సభ్యులు, బుల్లె రాజు, వెంకటేష్, ఎన్టీఆర్ శ్రీనివాసులు, బాలు, జీవ, లతీఫ్, ప్రజాశక్తి నగర్ శాఖ సభ్యులు పాల్గొన్నారు.

రాప్తాడులో అన్న క్యాంటీన్ ఏర్పాటు

రాప్తాడు : ఎమ్మెల్యే పరిటాల సునీతమ్మ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో అన్నాక్యాంటీన్‌ను ఏర్పాటు చేశారు. ఈమేరకు టిడిపి నాయకులు గురువారం ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మండల కేంద్రంలోని తహశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయాలతోపాటు ఆటో కార్మికులను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రాంతంలో అన్నా క్యాంటీన్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో యువరైతు మృతి

ప్రజాశక్తి-పుట్లూరు

రాజకుళ్లాయప్ప(ఫైల్‌ఫొటో)

విద్యుత్ షాక్‌కు గురై యువ రైతు మృతి చెందిన సంఘటన పుట్లూరు మండల పరిధిలోని చాలవేముల గ్రామంలో గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తుల తెలిపిన మేరకు ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... చాలవేముల గ్రామానికి చెందిన రాజకుళ్లాయప్ప(24) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం సాయంత్రం తన తోటలో ముళ్ల కంచెను శుభ్రం చేసేందుకు వెళ్లాడు. ముళ్ల కంచెను కట్టే సాయంతో తొలగిస్తుండగా కట్టెను అనుకోకుండా పైకి ఎత్తడంతో అక్కడ ఉన్న 11కెవి విద్యుత్ వైర్ తగిలింది. దీంతో షాక్‌కు గురై రాజకుళ్లాయప్ప అక్కడికక్కడే మరణించాడు. తోటి రైతులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు.

సమస్యల పరిష్కారానికి కదలిరండి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.శ్రీనివాసులు

ప్రజాశక్తి-గుంతకల్లు

సమస్యలను పరిష్కారం చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులను నిలదీసేందుకు ప్రజలు కదలిరావాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.శ్రీనివాసులు పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలను గుర్తించేందుకు సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజాపోరు యాత్ర గురువారం పట్టణంలోని 31, 32వవార్డుల్లో సాగింది. ఇందులో భాగంగా సిపిఎం నాయకులు ఆయావార్డుల్లోని మస్తాన్‌పేట, బిలాల్ మసీదు, భాగ్యనగర్ ప్రాంతాల్లో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా కాలనీల్లో రోడ్లు, మురికి కాలువలు లేక చిన్నపాటి వర్షాలకు మురుగు నీరు ఇళ్లలోకి వచ్చి ఇబ్బందులు పడుతున్నారన్నారు. రోడ్లు కూడా లేవన్నారు. చెత్తకుప్పలు తెప్పలుగా పేరుకుని పారిశుధ్యం అధ్వాన్నంగా తయారైందన్నారు. దోమలు వ్యాప్తి చెంది ప్రజలు రోగాల బారిన పడుతున్నారన్నారు. దోమల నివారణకు ఫాగింగ్ చేయడం లేదన్నారు. కుక్కల బెడదతో ప్రజలు ఆందోళన చెందుతున్నారన్నారు. ఆయా సమస్యలు పరిష్కారం కోసం సిపిఎం ఆధ్వర్యంలో జూన్ 2న మున్సిపల్ కార్యాలయం ఎదుట చేపట్టే మహాధర్నాకు ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి మారుతీప్రసాద్, కమిటీ సభ్యులు ఉలిగప్ప, ఈరన్న, అబ్దుల్లా, మోహన్, బాషా, కరన్, రాము, సంతోష్, ప్రభాస్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న సిపిఎం నాయకులు

వినూత్న ఆలోచనలతో పంటల సాగు

రైతులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలి - కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

రైతులు పంటల సాగులో వినూత్నంగా ఆలోచించి వ్యవసాయంలో సాంకేతికను అందిపుచ్చుకోవాలని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ తెలియజేశారు. మండల పరిధిలోని దెయ్యాలకుంటపల్లి, వెంకటాపురం గ్రామాల్లో రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో జిల్లాస్థాయి వికసిత కృషి సంకల్ప అభియాన్ ప్రారంభ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఖరీఫ్ సాగు ప్రారంభం అవుతున్న నేపథ్యంలో పంట సాగు, సాంకేతికత వినియోగం, ఎరువుల వాడకం తదితర అంశాలను వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం జూన్ మొదటి వారం వరకు ఉంటుందన్నారు. రోజుకు రెండు గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించి పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త, హెడ్ ఎస్ఎన్.మహేశ్వరి, రెడ్డిపల్లి ప్రధాన శాస్త్రవేత్త డా॥రాజన్న, శాస్త్రవేత్త డా॥శశికళ, ఇన్‌ఛార్జి జిల్లా ఉద్యాన అధికారి ఫిరోజ్ ఖాన్, ప్రకతి వ్యవసాయం డిపిఎం లక్ష్మానాయక్, ఆత్మ పీడీ మద్దిలేటి, తహశీల్దార్ పుణ్యవతి తదితరులు పాల్గొన్నారు.

వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

మెప్మా, గ్రంథాలయం పరిధిలో బదిలీల ప్రక్రియ

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం కలెక్టరేట్లోని రెవెన్యూ భవనంలో మెప్మా, జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగులు, సిబ్బందికి బదిలీల కౌన్సిలింగ్‌ను జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ముందుగా మెప్మాకు సంబంధించిన ఉద్యోగుల బదిలీల కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ ఆర్గనైజర్, డేటా ఎంట్రీ ఆపరేటర్ల బదిలీలకు సంబంధించి కౌన్సిలింగ్ నిర్వహించారు. అనంతరం జిల్లా గ్రంథాలయ సంస్థలో జిల్లాలోని గ్రంథాలయ సిబ్బంది సాధారణ బదిలీల కౌన్సిలింగ్‌ను నిర్వహించారు. లైబ్రేరియన్ గ్రేడ్ 3, రికార్డ్ అసిస్టెంట్,కార్యాలయ సహాయకుల బదిలీలకు సంబంధించి కౌన్సిలింగ్ కొనసాగింది. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

బదిలీల ప్రక్రియను నిర్వహిస్తున్న జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ

రంగయ్య దీక్షకు సంఘీభావం తెలుపుతున్న నాయకులు

ఆర్డీటీపై కక్షసాధింపును విడనాడాలి

మాజీ ఎంపి తలారి రంగయ్య-'సేవ్ ఆర్డీటీ-సేవ్ అనంతపూర్' దీక్ష

ప్రజాశక్తి-అనంతపురం

రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు (ఆర్డీటీ)పై కూటమి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కక్షసాధింపు చర్యలను విడనాడాలని మాజీ ఎంపి తలారి రంగయ్య సూచించారు. ఆర్డీటీ సంస్థ పరిరక్షణ కోసం 'సేవ్ ఆర్డీటీ–సేవ్ అనంతపురం' పేరుతో జిల్లాకేంద్రంలోని రంగయ్య కార్యాలయంలో దీక్ష చేపట్టా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్డీటీ సంస్థ వ్యవస్థాపకులు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ ఉమ్మడి జిల్లాకు ఎనలేని సేవ చేశారన్నారు. ముఖ్యంగా దళిత, గిరిజన, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి ఎన్నో కార్యక్రమాలు చేపట్టారన్నారు. ముఖ్యంగా పేదల కోసం కార్పొరేట్ ఆసుపత్రుల్లో దక్కని వైద్యం ఆర్డీటీ ద్వారా అందించారన్నారు. పదో తరగతిలో ఉన్నత మార్కులు సాధించిన విద్యార్థులను రూ.కోట్లు ఖర్చు చేసి కార్పొరేట్ కళాశాలల్లో చదివిస్తోందన్నారు. అలాంటి సంస్థకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విదేశీ నిధులను పునరుద్ధరించకపోవడం బాధాకరమన్నారు. వెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఆర్డీటీకి ఎఫ్‌సిఆర్‌ఎను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జూన్ 4 నుంచి 16 రోజులపాటు ఆర్డీటీ ప్రారంభమైన గోంచితండా నుంచి పాదయాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు. పాదయాత్రకు మేథావులు, ప్రజాసంఘాల నాయకులు, ఉద్యమకారులు, విద్యార్థి, యువజన నాయకులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కాగా రంగయ్య దీక్షకు వైఎస్ఆర్ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్‌యాదవ్ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు మంజునాథ్‌రెడ్డి, కార్యదర్శులు అశోక్, గంగశివుడు యాదవ్, నగర కార్యదర్శులు ఫయాజ్, రఫీ, రాహుల్‌రెడ్డి, కార్తీక్, మహమ్మద్ బాషా, ఇంటలెక్చువల్ విభాగపు రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ శంకరయ్య, రాష్ట్ర కార్యదర్శి తనీషా, జడ్పీటీసీ గుగ్గిళ్ళ నాగరాజు, దాసిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

యోగాపై వ్యాస రచన పోటీలు

ప్రజాశక్తి-యాడికి

మండల కేంద్రంలోని స్టార్ ప్యారడైజ్ హైస్కూల్‌లో యోగాపై గురువారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ నాగేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ రోజూ యోగా చేయడం వల్ల మానసిక ప్రశాంతత పొందవచ్చన్నారు. అనంతరం యోగాపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ సెక్రటరీ హాజీవలి, మహిళా సంరక్షణ కార్యదర్శి కృష్ణాంజలి, స్టార్ పారడైజ్ హై స్కూల్ మేనేజ్‌మెంట్ నాగేంద్ర, ఉపాధ్యాయులు కుమారి, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎంపిలు గర్భిణులను స్కానింగ్ సెంటర్లకు పంపొద్దు

డిఎంహెచ్ఒ ఇబి దేవి

ప్రజాశక్తి-అనంతపురం

గ్రామీణ ప్రాంతాల్లోని ఆర్ఎంపి వైద్యులు గర్భిణలను ప్రయివేటు స్కానింగ్ సెంటర్లకు సిఫారసు చేయకూడదని డిఎంహెచ్ఒ ఇబి దేవి గురువారం ఒక ప్రకటనలో సూచించారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధిత చట్టం–1994 ప్రకారం గర్భిణులు ఎవరైనా స్కానింగ్‌కు వచ్చినప్పుడు ఎవరు సిఫారసు చేస్తే వచ్చారో తెలుసుకోవాలన్నారు. ఆర్ఎంపి వైద్యులు పంపితే స్కానింగ్‌లు చేయకూడదన్నారు. అలా చేస్తే పిసిపిఎన్‌డిటి చట్టం ప్రకారం శిక్షార్హులు అవుతారన్నారు. గర్భిణులు కూడా ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే స్కానింగ్‌లు చేయించుకోవాలన్నారు. ఇకపోతే మాతాశిశు మరణాలను అరికట్టే బాధ్యత గర్భిణులతోపాటు కుటుంబ సభ్యులు, వైద్యసిబ్బందిపై ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మాత మరణాలు శిశు మరణాలు నిర్మూలించడం కోసం అనేక రకాల వైద్యసేవలను అందిస్తోందన్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వం వాక్సిన్‌లతో పాటు రెండుసార్లు స్కానింగ్ చేస్తున్నట్లు తెలిపారు. గర్భిణులు అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆసుపత్రులు, సర్వజన ఆసుపత్రిల్లోనే వైద్యసేవలు పొందాలన్నారు.

పార్టీలకతీతంగా ఆర్డీటీని కాపాడుకుందాం

వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త రంగయ్య

మాట్లాడుతున్న వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త రంగయ్య

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

పార్టీలకు అతీతంగా తరలివచ్చి రూరల్ డెవలప్‌మెంట్ (ఆర్డీటీ)ని కాపాడుకుందామని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త, పిఎసి కమిటీ సభ్యులు తలారి రంగయ్య పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని వైసిపి కార్యాలయంలో 'ఆర్డీటీని రక్షించుకుందాం -అనంతపురాన్ని కాపాడుకుందాం' అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా నాయకులు, ప్రజా, కులసంఘాల నాయకులు, మేధావులు, పాత్రికేయులు ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి ఆర్డీటీని కాపాడుకునేందుకు పోరాడుదామన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం, క్రీడల్లో జిల్లాను ఉన్నత స్థానంలో నిలవడంలో ఆర్డీటీ పాత్ర ముఖ్యమైందన్నారు. అలాంటి ఆర్డీటీని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఆర్డీటీ కోసం చేసే ఉద్యమానికి త్వరలో కాంగ్రెస్, సిపిఎం సిపిఐ, ప్రజా సంఘాల నాయకులు, ప్రజలతో మమేకమై భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు.

ఎయిడ్స్‌పై అవగాహన

ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న కళాబృందం

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో జంగం శ్రీనివాసులు కళాబృందం హెచ్ఐవి, ఎయిడ్స్‌పై గురువారం అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా హెచ్ఐవి, ఎయిడ్స్ ఎలా వస్తుంది, ఎలా వ్యాపించదు, రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, వ్యాధిగ్రస్తులపై వివక్ష చూపకుండా ఎలా కలిసి జీవించాలనే విషయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో డెవలప్‌మెంట్ సొసైటీ సంస్థ (రీడ్స్) ప్రాజెక్ట్ మేనేజర్ మహేష్, ఎంఇఎ కిరణ్‌కుమార్, ఎఎన్ఎం వరలక్ష్మి, ఒఆర్‌డబ్ల్యూస్ పద్మ, నీలావతి, షకీలా, సావిత్రి, నాగరాజు, పీర్ ఎడ్యుకేటర్స్, ప్రజలు, జంగం శ్రీనివాసులు కళా బృందం పాల్గొన్నారు.

ప్రతి రేషన్ దుకాణాన్నీ పరిశీలించాలి

రేషన్ దుకాణాన్ని పరిశీలిస్తున్న తహశీల్దార్ శేషాద్రి

పుట్లూరు : మండలంలోని ప్రతి రేషన్ దుకాణాన్నీ పరిశీలించాలని తహశీల్దార్ శేషారెడ్డి సంబంధిత విఆర్ఒలను ఆదేశించారు. గురువారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతనెల వరకూ ఎండియు ఆపరేటర్లు ద్వారా పంపిణీ జరిగేదన్నారు. అయితే వారిని తొలగించిన నేపథ్యంలో వచ్చేనెల 1వతేదీ నుంచి డీలర్లే పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కావున రేషన్ పంపిణీ సక్రమంగా జరిగేందుకు విఆర్ఒలు రేషన్ దుకాణాలను పరిశీలించాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని రేషన్ దుకాణాలను పరిశీలించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

'యోగాంధ్ర'లో వక్తలు

యోగాసనాలు వేస్తున్న అధికారులు, ప్రజలు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

ప్రతి ఒక్కరూ యోగాను చేయడం అలవాటు చేసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని కమిషనర్ బాలస్వామి అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ప్రధాన రహదారిపై నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ యోగా చేయడం ద్వారా ప్రజలందరూ శారీరిక ధృఢత్వాన్ని పెంచుకోవడంతోపాటు ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపవచ్చన్నారు. కావున ప్రతి ఒక్కరూ తమ దినచర్యలో యోగాను చేసుకోవడం అలవాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ చంద్రశేఖర్, డ్వామా పీడీ సలీంబాషా, డిఎంహెచ్ఒ ఇబి దేవి, కార్పొరేషన్ ఇంజినీర్లు, సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

నార్పల : యోగాను అలవాటు చేసుకుని ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని ఎంపిడిఒ భాస్కర్ సూచించారు. గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం మీటింగ్ హాల్‌లో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపుమేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలందరూ యోగా చేయడం ద్వారా మనసిక, శారీరక ధృఢత్వాన్ని పెంచుకోవడంతోపాటు రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి శైలజారాణి, ఎఒ ఉమాదేవి, ఎపిఒలు ఎర్రమ్మ, రమేష్ రామారావు, ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది నూర్‌మొహమ్మద్, రవీందర్‌నాథ్‌రెడ్డి, జగన్నాథ్‌రెడ్డి, సురేష్, మోహన్, యునాని, వైద్యులు రఫీ ఉద్దీన్ ఖాన్, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, ఉపాధి టెక్నికల్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

బొమ్మనహాల్ : మండల పరిధిలోని వెంకటేశ్వర ఆలయంలో యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ విజయభాస్కర్ మాట్లాడుతూ ప్రజలందరూ యోగా చేయడం ద్వారా మనసిక, శారీరక ధృఢత్వాన్ని పెంచుకోవడంతోపాటు రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. యోగాలో పాల్గొన్న వారికి ఆలయ పెద్దలు అల్పాహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ రవితేజ, సిబ్బంది పాల్గొన్నారు.

బూటకపు ఎన్‌కౌంటర్లపై విచారణ చేపట్టాలి

ఒపిడిఆర్ రాష్ట్ర కమిటీ కార్యదర్శి ఆర్.రామ్‌కుమార్

ప్రజాశక్తి-గుంతకల్లు

అడవుల్లో నివసిస్తున్న గిరిజనుల హక్కుల సాధన కోసం ఉద్యమాలు చేస్తున్న వారిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సైన్యంతో చేయిస్తున్న బూటకపు ఎన్‌కౌంటర్లపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ చేపట్టాలని ఒపిడిఆర్ రాష్ట్ర కమిటీ కార్యదర్శి ఆర్.రాంకుమార్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఒపిడిఆర్ కార్యాలయంలో జిల్లా ఉపాధ్యక్షుడు వి.నాగరాజు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు రాజ్యాంగం కల్పించిన జీవించే హక్కును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయన్నారు. ప్రజల హక్కుల కోసం పోరాడే వారిని కుట్రధారులుగా.. మావోయిస్టు పార్టీలతో సంబంధాలు ఉన్నాయని సానుభూతిపరులుగా చిత్రీకరించి అడవుల్లో నివసిస్తున్న గిరిజనులను ఎన్‌కౌంటర్ల పేరుతో హత్యలు చేయడం దుర్మార్గమన్నారు. మావోయిస్టులు ప్రభుత్వంతో చర్చలు జరపడానికి తాము సిద్ధంగా ఉన్నామని చెప్పినా.. పట్టించుకోకుండా ఎన్‌కౌంటర్ల పేరుతో హత్యలు చేసిందన్నారు. అంతేగాకుండా మృతిచెందిన ఉద్యమకారుల భౌతికకాయాలను కూడా కుటుంబ సభ్యులకు అప్పగించకుండా వారే తగలబెట్టడం అరచకత్వానికి నిదర్శనమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం బూటకపు ఎన్‌కౌంటర్లను ఆపి మావోయిస్టులతో చర్చలు జరిపేందుకు ముందుకు రావాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ అధ్యక్షుడు బి.సురేష్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.జయరామ్, సహాయ కార్యదర్శి బి.తిమ్మప్ప, ఒపిడిఆర్ జిల్లా కమిటీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రైతు సేవాకేంద్రాలకు చేరిన విత్తనకాయలు

నేటి నుంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియ

పెరవలి గ్రామంలో వేరుచెనగా కాయలు పరిశీలిస్తున్న వీఆర్వో రాముడు

ప్రజాశక్తి-శింగనమల

మండలంలోని రైతు సేవాకేంద్రాలకు గురువారం విత్తన వేరుశనగ విత్తనాలు చేరినట్లు ఎఒ అన్వేష్‌కుమార్ తెలిపారు. మండలంలోని పెరవలి, వెస్ట్ నర్సాపురం, రాచేపల్లి, ఆకులేడు, శోదనపల్లి, శింగనమల, సలకం చెరువు రైతు సేవా కేంద్రాలకు 701.4 క్వింటాళ్ల విత్తనకాయలు వచ్చాయన్నారు. ఖరీఫ్–2025 సంవత్సరానికి సంబంధించి మండలానికి 1400 క్వింటాళ్ల కె.6, టిసిజిఎస్–1694 రకం కాలు 100 క్వింటాళ్లు చేరినట్లు తెలిపారు. కాయలు కావాల్సిన రైతులు నేటి నుంచి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. ఈమేరకు పెరవలిలో విత్తనకాయల నాణ్యతను విఆర్ఒ రాముడు, సచివాలయ వ్యవసాయ శాఖ అధికారిణి భార్గవి, తదితరులు పరిశీలించారు.

నార్పల : విత్తన వేరుశనగ కాయలు కావాల్సిన రైతులు నేటి నుంచి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి చెన్నవీరస్వామి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖరీఫ్–2025 కాలానికి సంబంధించి మండలానికి 1,600 క్వింటాళ్ల వేరుశనగ మండలానికి కేటాయించినట్లు తెలిపారు. విత్తనకాయలు కావాల్సిన రైతులు ఆధార్, పట్టాదారు పాస్ పుస్తకం, మొబైల్ నెంబర్‌ను మీ పరిధిలోని రైతు సేవా కేంద్రాల వద్దకు వెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

ఆత్మకూరు : విత్తన వేరుశనగ కాయలు కావాల్సిన రైతులు శుక్రవారం నుంచి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారిణి సుచరిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కాయలు కావాల్సిన రైతులు తమ ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం, మొబైల్ ఫోన్‌తో మీ పరిధిలోని రైతు సేవాకేంద్రాల్లో సంప్రదించాలని కోరారు.

బస్సులు లేక ప్రయాణికుల ఇక్కట్లు

బస్సుల కోసం ఎదురుచేస్తున్న ప్రయాణికులు

ప్రజాశక్తి-యల్లనూరు

మండలం మీదుగా ప్రయాణిస్తున్న ఆర్టీసీ వాహనాలు తిప్పకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉదయం ఆరు గంటల నుంచే తాడిపత్రి వయా యల్లనూరు, సింహాద్రిపురం వరకూ బస్సులు తిరిగేవి. అయితే ఎక్కువ శాతం కడపలో జరుగుతున్న మహానాడుకు ఆర్టీసీ బస్సులు తరలించడంతో బస్సులు లేకుండా పోయాయని ప్రయాణికులు విమర్శించారు. యల్లనూరు మండల కేంద్రం నుంచి కనీసం ఒక్క బస్సు సర్వీసు కూడా లేకపోవడంతో విస్మయం వ్యక్తం చేశారు. చేసేది లేక ప్రయివేటు వాహనాలను ఆశ్రయించాల్సి వచ్చింది.

ప్లాస్టిక్ అమ్మకాలపై అధికారుల దాడులు

అనంతపురంలో పట్టుకున్న ప్లాస్టిక్ వస్తువులను ట్రాక్టర్‌లో తరలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగరంలోని పలు దుకాణాల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ అమ్మకాలపై కార్పొరేషన్ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. ఇందులో భాగంగా కమిషనర్ బాలస్వామి అన్ని విభాగాల అధికారులు, ఉద్యోగులు, సచివాలయ ఉద్యోగులను కలుపుకుని 13 బృందాలు ఏకకాలంలో నగరంలోని అన్ని ప్రాంతాల్లో ఆకస్మికంగా దాడులు చేశారు. ఈ దాడుల్లో సుమారు ఐదు టన్నుల ప్లాస్టిక్ టన్నుల ప్లాస్టిక్ సీజ్ చేసి ఆరు ట్రాక్టర్లలో గోడౌన్‌కు తరలించారు. అలాగే రూ.లక్షకుపైగా జరిమానా విధించారు. దీనితోడు ఓ ప్లాస్టిక్ విక్రేత సిబ్బందితో దురుసుగా వ్యవహరించడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శానిటరీ ఇన్స్పెక్టర్ నల్లప్ప పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దాడుల్లో పట్టుబడిన ప్లాస్టిక్‌ను ఎక్కడికక్కడ సీజ్ చేసి కార్పొరేషన్ కార్యాలయ గోడౌన్‌కు తరలించారు. దీంతో సాయంకాలం ప్లాస్టిక్ వ్యాపారులందరూ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయానికి చేరుకున్నారు. ఎలాగైనా సీజ్ చేసిన ప్లాస్టిక్ సామాగ్రిని అధికారులపై ఒత్తిడి తెచ్చి తీసుకెళ్లాలి అన్న పట్టుదలతో కనిపించారు. అయితే గతంలో జరిగిన పరిణామాలను దృష్టిలో ఉంచుకుని అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని నగరవాసులు కోరుతున్నారు.

రాయదుర్గం : పట్టణంలోని వాణిజ్య సంస్థలు, దుకాణాలపై మున్సిపల్ అధికారులు గురువారం తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్ రవీంద్రయాదవ్, సచివాలయ శానిటరీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

డిసిసిబి ఛైర్మన్ నియామక జీవో విడుదల

ప్రజాశక్తి-అనంతపురం

ఎడిసిసి బ్యాంకు ఛైర్మన్‌గా ముంటిమడుగు కేశవరెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులను జారీ చేసింది. ముంటిమడుగు కేశవరెడ్డిని ఎడిసిసిబిగా నియమిస్తూ ఇటీవల ప్రభుత్వం జాబితాలను విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో జీవో 1 ఉత్తర్వుల ప్రకారం నియామక ఉత్తర్వులను ప్రభుత్వం విడుదల చేసింది.

నేడు యోగా పోటీలు

ఉరవకొండ : యోగాంధ్ర–2025లో భాగంగా మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం గ్రామ, వార్డుస్థాయిలో యోగా పోటీలు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ రవిప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఉదయం స్థానిక షిరిడీ సాయి కల్యాణ మండపంలో ఆయుర్, ఆయుష్ ఆధ్వర్యంలో సంయుక్తంగా పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

రైల్వే స్టేషన్‌మాస్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న తాడిపత్రివాసులు

కాచిగూడ-మధురై రైలును పునరుద్ధరించాలి

తాడిపత్రి : గతంలో ఉన్న కాచిగూడ–మధురై రైలును పునరుద్ధరించాలని పలువురు యువకులు కోరారు. ఈమేరకు గురువారం స్థానిక రైల్వేస్టేషన్‌లో స్టేషన్‌మాస్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాచిగూడ–మధురై రైలును రద్దు చేయడం వల్ల తాడిపత్రి మీదుగా అరుణాచలం యాత్రకు భక్తులకు ఇబ్బంది కలుగుతోందన్నారు. కావున ప్రజలు, భక్తుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వెంటనే కాచిగూడ–మదురై రైలును పునరుద్ధరించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో పట్టణ యువకులు బి.మధు, శేషఫణి, తదితరులు ఉన్నారు.

వెంకట నరసానాయుడుకు అభినందన

పురస్కారం అందుకుంటున్న ఆలం వెంకట నరసానాయుడు

నార్పల : వెంకట్ వకుళా ఫౌండేషన్ ఛైర్మన్ ఆలం వెంకట నరసానాయుడును ఎన్టీఆర్ ట్రస్ట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రాజేంద్రకుమార్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ఎన్టీఆర్ ట్రస్టు గోపీ అభినందించారు. నరసానాయుడు జన్మదినం సందర్భంగా రెండేళ్లుగా మండల కేంద్రంలో దాదాపు 1070 యూనిట్లు రక్తదానం చేసినందుకు కడపలో జరుగుతున్న మహానాడులో ఎన్టీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంప్ రక్తదాన శిబిరంలో వెంకట నరసానాయుడుకు జ్ఞాపికను బహూకరించి ప్రత్యేకంగా అభినందించారు.

వైద్యానికి ఆర్థికసాయం

ఆర్థికసాయం అంజేస్తున్న నాగులగుడ్డం వెంకటరమణ

శింగనమల : మండలంలో గురుగుంట్ల గ్రామానికి చెందిన నారాయణ, నాగలక్ష్మి కుమారుడు నాగార్జునకు వైసిపి నాయకులు నాగులగుడం వెంకటరమణ గురువారం రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. నాగార్జున ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాపయడి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న వెంకటరమణ ఆసుపత్రికి వెళ్లి నాగార్జునను పరామర్శించి కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందించారు.

నీటి సమస్య పరిష్కారానికి వినతి

స్థానికులతో మాట్లాడుతున్న పురపాలక సంఘం అధ్యక్షురాలు పొరాళు శిల్ప

రాయదుర్గం : పట్టణంలోని బిటిపి రోడ్డు మోడల్ కాలనీ లే అవుట్లో తాగునీటి ఎద్దడి నివారించాలని పలువురు స్థానికులు రాయదుర్గం పురపాలక సంఘం అధ్యక్షులు పొరాళు శిల్పను కలిసి గురువారం వినతిపత్రం అందజేశారు. ఇందులో భాగంగా తమ కాలనీలో తాగునీటి బోర్ మరమ్మతులకు గురై నీటి సమస్య ఉందని, వీధిదీపాలు లేక ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. కావున సమస్య పరిష్కరించాలని కోరారు.

రేపు వెంకటరమణస్వామి విగ్రహ ప్రతిష్టాపన

యల్లనూరు : మండల పరిధిలోని తిమ్మంపల్లి గ్రామంలో చింతల వెంకటరమణ స్వామి విగ్రహాన్ని శనివారం ప్రతిష్టించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విగ్రహ ప్రతిష్టాపనలో మండలంతోపాటు తాడిపత్రి నియోజకవర్గ ప్రజలు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.

నేడు హుండీ లెక్కింపు

ఉరవకొండ : విడపనకల్లు మండల పరిధిలోని పాల్తూరు గ్రామ శివారులో వెలసిన ఉండబండ వీరభద్రస్వామి ఆలయ హుండీని శుక్రవారం లెక్కించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి కె.విజయ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవాదాయ శాఖ పర్యవేక్షణ అధికారుల సమక్షంలో దేవస్థానంలో ఏర్పాటు చేసిన శాశ్వత హుండీలను తెరచి లెక్కించనున్నట్లు తెలిపారు. లెక్కింపులో పాల్గొనాలనుకునేవారు సంప్రదాయ దుస్తుల్లో రావాలని కోరారు.

టిడ్కో ఇళ్లు పూర్తి చేయాలని వినతి

రాయదుర్గం : టిడ్కో ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు స్వాధీనం చేయాలని సిపిఐ నాయకులు కోరారు. ఈమేరకు గురువారం పట్టణంలోని కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు మాట్లాడుతూ గతంలో టిడిపి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు చేపట్టిన టిడ్కో ఇళ్ల నిర్మాణాలు నేటికీ పూర్తి కాలేదన్నారు. దాదాపు 90శాతం పనులు పూర్తయినా మిగిలిన పనులను పూర్తి చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం మంచిది కాదన్నారు. వెంటనే ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో సిపిఐ పట్టణ కార్యదర్శి రవీంద్రనాథ్, తేజ, అనిల్, కిషోర్, తదితరులు ఉన్నారు.

నేరాలు ఘోరాలు

పాముకాటుతో మహిళ మృతి

మృతిచెందిన సావిత్రమ్మ

బెలుగుప్ప : వ్యవసాయ తోటలో రక్తపింజిరి కాటు వేయడంతో పాటిల్ సావిత్రమ్మ (60) మృతిచెందిన ఘటన మండల పరిధిలోని అంకంపల్లి గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అంకంపల్లి గ్రామానికి చెందిన పాటిల్ సావిత్రమ్మ తన తోటలో కలుపు మొక్కలు తొలగిస్తుండగా గడ్డిపొదల్లో ఉన్న రక్తపింజరి కాటు వేసింది. దీంతో అక్కడే సొమ్మసిల్లి పడిపోయింది. గమణించిన స్థానికులు భర్తకు సమాచారం అందించగా హుటాహుటిన భర్త పాటిల్ ప్రభాకర్‌రెడ్డి వాహనంలో ఆసుపత్రి తరలించారు. అయితే ఆమె అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. సావిత్రమ్మకు భర్త, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఎస్ఐ శివ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

గుంతలో పడి వ్యక్తి..

రాయదుర్గం : పట్టణ శివారు ప్రాంతంలో గౌడ లే ఔట్ సమీపంలో వెంకటేశులు అనే వ్యక్తి మద్యం మత్తులో గుంతలో మృతిచెందాడు. గమణించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్ఐ ప్రసాద్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం గుంతలో నుంచి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడు మారంపల్లి వీధికి చెందిన వ్యక్తిగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.